క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం



పాన్‌గల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయానికి బుధవారం మండల కేంద్రానికి చెందిన కీ.శే. మద్దెల్లరాఘవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య ఇందిరమ్మ, కుమారులు భాస్కర్‌రెడ్డి, నవీన్ రెడ్డి రూ.50,116ను విరాళంగా ఇచ్చారు. విరాళంగా ప్రకటించిన నగదును చెక్కు రూపంలో ఆలయ కమిటీ సభ్యులకుఅందజేశారు. విరాళం అందజేసిన వారి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

రాగి అంబలి పంపిణీ



ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉపాధ్యాయులు రాగి అంబలిని పంపిణీ చేశారు. వేసవి సెలవులు ఇచ్చేంత వరకు ప్రతిరోజు విద్యార్థులకు రాగి అంబలి అందించనున్నట్లు హెచ్‌ఎం రియాజుద్దీన్ తెలిపారు. ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుని రాగి అంబలిని పంపిణీ చేయడం అభినందనీయమని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవాచారి, అనురాధ, వెంకటేశ్వర్ రెడ్డి, గీతారాణి, కళావతి, సీఆర్పీ సౌమ్యరాణి, విద్యార్థులున్నారు.

రేపు మెగా వైద్య శిబిరం



వనపర్తి టౌన్: ప్రజలు మెచ్చే సేవల ద్వారానే వైద్యులకు గుర్తింపు లభిస్తుందని ప్రజా వైద్యశాల నిర్వాహకుడు, ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ మురళీధర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 3న ప్రజలకు ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నామని, క్యాంపులో అవసరమైన వారికి ఉచితంగా అన్ని రకాల పరీక్షలు చేయడంతో పాటుగా హెర్నియా, హైడ్రోసిల్, ఫిస్టులా, అపెండిక్స్, సుంతి, పైల్స్, ఫిషర్లు, గడ్డలు, మధుమేహ (షుగర్) సంబంధిత పుండ్లు, థైరాయిడ్ ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు శారద, హరి, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల పిల్లలకు రేషన్ బియ్యం ఇవ్వాలి



కొత్తకోట: రేషన్ కార్డులో నమోదు చేసుకున్న ఐదేళ్ల వయస్సు ఉన్న పిల్లలకు రేషన్ బియ్యం ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రెడ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా నేటికీ రాకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నిక్సన్ అన్నారు. కార్యక్రమంలో రాములుయాదవ్, విజయ్, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తం

కొత్తకోట రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పెద్దమందడి ఎస్‌ఐ హరిప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని గిరిజన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల లోన్ యాప్, సైబర్ నేరాల వల్ల కొందరు ఆత్మహత్యలకు పాల్పడడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు పోలీసుల సేవలను వినియోగించుకునేందుకు, ఆపద సమయాల్లో 100 నంబర్‌కు ఫోన్ చేస్తే క్షణాల్లో పోలీసులు అక్కడకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు ఉన్నారు.

బదిలీలు చేపట్టాలి

వనపర్తి టౌన్: వాయిదా పడిన ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రభుత్వం పునఃప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌టీయూటీఎఫ్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని ~ రు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, కార్యదర్శి కృష్ణయ్య, ప్రతినిధులు బి. వెంకటేష్, లక్ష్మణ్‌నాయక్ , వెంకటేష్, భగవంతు, రఫీ, అర్జున్‌నాయక్, శివరాజు, హనుమంతు, సుభాష్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణ పూజలు



శ్రీరంగాపురంలో ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం మంగళ వాయిద్యాలు, వేద పండితుల వేద మంత్రోచ్చరణలతో ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరీపూజలు నిర్వహించారు. భక్తులు గోవిందనామ స్మరణతో కార్యక్రమాన్ని వీక్షించారు. వేడుక అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రోజు ఉదయం, సాయంకాలం విశేష పూజలు, వాహన సేవలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు విష్ణునారాయణ, అర్చకులు గోవిందాచార్యులు, సురేశాచార్యులు, కస్తూర్యస్వామి ఉన్నారు.

చిక్కేపల్లిలో గోమాత పూజ

పాన్‌గల్: చిక్కేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో సిద్ధయ్య స్వామి ఆధ్వర్యంలో బుధవారం గోమాత పూజ నిర్వహించారు. గోవును పూజించడంతో కలిగే శుభాలు, గోమాత పూజ అవశ్యకతను భక్తులకు వివరించారు. ప్రతి నిత్యం ఆవును పూజించడంతో లక్ష్మీదేవి ఆ ఇంటిలో స్థిర నివాసం ఏర్పర్చుకుంటుందని, కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మన పూర్వీకులు ప్రతి నిత్యం ఆవును పూజించేవారని, కానీ నేడు ఆచారాలు కనిపించడం లేదని ఆందోళన చెందారు. సర్పంచ్ బాలస్వామి యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకట్‌రాములుయాదవ్, బిచ్చాల్, నర్సింహ, కుర్మయ్య, రాజు, ఖాదర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



చిక్కేపల్లిలో గోవులకు పూజ చేస్తున్న గ్రామస్తులు

స్వచ్ఛ గ్రామాలుగా మార్చేందుకు కృషి



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్

అమరచింత: మండలంలోని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలు తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపీడీఓ జ్యోతి పరుషియ కోరారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మూడో రోజు ఎస్‌బీఎంపై మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ మహిళా సంఘాల లీడర్లు, బుక్ కీపర్లకు స్వచ్ఛ పక్వాడ్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి స్థాయిలో నిర్మించాలని సూచించారు. మూడో రోజుల అవగాహన కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లో పాటించాలన్నారు. ప్రభుత్వం ముందుచూపుతో గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు ప్రస్తుతం పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చాయని తెలిపారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు మాట్లాడుతూ స్వచ్ఛతపై గ్రామాల్లో తీసుకోవాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. సంపూర్ణ పరిశుభ్ర గ్రామంగా మార్చుకొనేందుకు రహదారులన్నీ ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. చెట్లతో గ్రామంలో పచ్చదనం పరచాలన్నారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డినే వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు రమేష్, కుర్మయ్య, ఫరీద్, రాజు, సత్యన్న, రఘు, ఎంపీఓ నరసింహులు, ఏపీఓ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశం

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్‌కు చెందిన రమాదేవి (20) కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమో దు చేసినట్లు ఎస్‌ఐ జగదీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగాపూర్‌కు చెందిన బొంగు తిరుపతయ్య రెండో కూతురు రమాదేవి ఇంటర్ వరకు చుదుకొని ఇంటి వద్దే ఉంటుంది. ఈ క్రమంలో మంగళవారం తల్లిదండ్రులతో పెంట్లవెల్లి మండలంలోని జట్‌ప్రోలు గ్రామానికి పోయివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. రమాదేవికి నాలుగు రోజుల క్రితం కొల్లాపూర్ మండలం రాంపూర్‌కు చెందిన అబ్బాయితో నిశ్చితార్థం జరిగింది. చుట్టు పక్కల గ్రామాల బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో తండ్రి బొంగు తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచేలా సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో50 మందికి తగ్గకుండా కూలీలు పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలని, నీడ కోసం నెట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు వంద శాతం పెరిగేలా చూడాలన్నారు. గ్రామాల వారీగా ఉపాధి కూలీలు, నర్సరీల్లో మొక్కలపై ఆరా తీశారు. పనులపై నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈసీ అంజన్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో అధిక లాభాలు

మదనాపురం: చిరుధాన్యాల ఉత్పత్తి విలువ ఆధారిత ఉత్పత్తులపై బుధవారం మండల కేంద్రంలోని కేవీకేలో రైతులకు శాస్త్రవేత్త అనిత ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి గుర్తించిందని, ఇందులో భాగంగానే చిరుధాన్యం ఉత్పత్తులకు డిమాండ్ పెరగనుందని వెల్లడించారు. అనంతరం సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి చిరుధాన్యాల ఉత్పత్తి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే హెడ్ డాక్టర్ కొగారే, ఫీల్డ్ ఆఫీసర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఖిల్లాఘనపురంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



మోట్లంపల్లిలో..

ఆత్మకూర్: మండలంలోని మోట్లంపల్లి, గుంటిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి చక్కగా పాఠాలను బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వీరన్న, ఉమాశంకర్, ఉపాధ్యాయులు విజయ్, శాంతన్న, శ్రీరాములు, సీఆర్పీ సౌమ్యరాణి, విద్యార్థులున్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్‌గా అబుబకర్, డీఈఓగా రాంచరణ్, ఎంఈఓగా మేఘమాల, ప్రధానోపాధ్యాయులుగా నందిని వ్యవహరించారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు ఘనంగా స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓగా మౌనిక, హెచ్‌ఎంగా పూజిత విధులు నిర్వహించారు. వీరిలో చక్కటి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామచంద్రయ్య, ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, రేణుక, మాధవిలత, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎకనామిక్స్ ఎగ్జిబిషన్

కొత్తకోట రూరల్: పెద్దమందడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులు నిర్వహించిన ఎకనామిక్స్ ఎగ్జిబిషన్ పలువురిని ఆకట్టుకుంది. సైన్స్ ఫెయిర్ మాదిరిగా ఎకనామిక్స్ ఫెయిర్ నిర్వహించిన ఎకనామిక్స్ అధ్యాపకుడు శ్రీనివాస్‌రెడ్డిని పలువురు అభినందించారు. ఈ ఎగ్జిబిషన్‌లో డిమాండ్ సిద్ధాంతం, పర్యాటకం, బీమా, టీఎస్ సంక్షేమ పథకాలు, పేదరికం, రవాణా, మార్కెట్ రకాలు తదితర ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పెద్దమందడి, మనిగిళ్ల పాఠశాలల విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ప్రదర్శన అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం శాంతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతయ్య, కాశీవిశ్వనాథ్, గోవర్దన్, మహేందర్, భానుప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ నర్సింహ, జూనియర్ అసిస్టెంట్ ఎండీ ఖాజామైనోద్దీన్, శ్రీనివాస్‌శర్మ, అబ్దుల్ షమీ, మహమూదాబేగం ఉన్నారు.

బెల్లం మాఫియాను అరికట్టాలి



ఎక్సైజ్ సీఐ సుభాష్‌చందర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వనపర్తి క్రైం: పట్టణంలో బెల్లం మాఫియాను అరికట్టి, ప్రజలకు తక్కువ ధరలకు విక్రయించాలని కోరుతూ బుధవారం అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ఎక్సైజ్ సీఐ సుభాష్‌చందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు సతీష్‌యాదవ్ మాట్లాడుతూ వనపర్తిలోని కిరాణాల్లో విక్రయాలు జరగకుండా కిలో బెల్లం రూ.40లఉండాల్సింది పండుగ ఆసరాగా చేసుకొని రూ.120 దాక అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటి నుంచి ఉగాది పండుగ వరకు బెల్లం రూ.50లకే దొరికే విధంగా ఎక్సైజ్ శాఖ అధికారులు చొరవతీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటేష్, రాములు, గోపాలకృష్ణ, సుధాకర్, లక్ష్మన్, బాలు ఉన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

జిల్లా కేంద్రంలో కొందరు డబ్బులకు అలవాటు పడి వర్తక సంఘంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వర్తక సంఘం అధ్యక్షుడు కొత్రా రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నిరోజులుగా పండుగ సమయంలో జీఎస్టీ బిల్లుతో బెల్లం తెచ్చి ప్రతి కిరాణ దుకాణానికి బెల్లం పంపించి, ప్రజలకు తక్కువ ధరకు విక్రయించేలా సంఘం చర్యలు తీసుకుంటుందని, కార్పొరేట్ కంపెనీల్లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారన్నారు. ఇది సహించలేక కార్పొరేట్‌కు కొమ్ముకాసే కొందరు వ్యక్తులు వారిచ్చే కాసులకు కక్కుర్తిపడి వర్తక సంఘంపై తప్పుడూ ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి తప్పుడు ఆరోపణలు ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత కట్టు శిక్షణ

కొత్తకోట: మండలంలోని నిర్వేన్ గ్రామంలో మహిళలకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, కార్మిక శాఖ వారి ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథం, మేస్త్రీ సంఘం అధ్యక్షులు వెంకటయ్య, నర్సింహ, శిక్షకులు కవిత, గంగాధర్ తదితరులు ఉన్నారు.

కంటివెలుగు శిబిరం

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని 8వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా కంటి పరీక్షలు చేయిస్తుందని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, పార్వతి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ ముస్తాక్, మున్సిపల్ మేనేజర్ గణేష్‌బాబు, వైద్య సిబ్బంది, నాయకులు సాయినాథ్, సత్యనారాయణ, భారతి పాల్గొన్నారు.

504 మందికి..

పాన్‌గల్: మండలంలోని చింతకుంట, కేతేపల్లి, రాయినిపల్లి గ్రామాల్లో బుధవారం 504 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వీరిలో 48 మందికి కంటి అద్దాలు, 23 మందిని ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ఇసుక రవాణాకు అనుమతివ్వాలని ధర్నా

అమరచింత: ఎద్దుల బండ్లతో ఇసుకను రవాణా చేయడానికి అనుమతి ఇవ్వాలంటూ వాటి యజమానులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఇసుక రవాణా కోసం చేస్తున్న ధర్నాకు రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఇంటి నిర్మాణాల కోసం ఇసుక కొరత ఉందని, దీంతో తప్పని పరిస్థితుల్లో ఎడ్ల బండ్లతో ఇసుకను రవాణా చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ అడ్డుకోవడం ఎంత వరకు సమంజసం అంటూ ఆందోళనకు పూనుకున్నారు. టిప్పర్లతో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోని ప్రభుత్వం, బక్కచిక్కిన రైతుల ఎడ్లబండ్లపై చర్యలు తీసుకుంటామనడం తగదన్నారు. ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఇసుక రవాణా చేయడానికి అనుమతులు లేవని, ధర్నా విరమించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వెంకటేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదుతో కేసు నమోదు

పెబ్బేరు రూరల్: బ్యాంక్ మేనేజర్‌ను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బండెల వెంకటయ్య తన భార్య అకౌంట్‌లో పేరును మార్చాలని సోమవారం ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ ఝాన్సీరాణిని కలిశారు. మళ్లీ రావాలని మేనేజర్ సూచించినా.. వినిపించుకోకుండా అసభ్యంగా మా ట్లాడాడని, విధులకు ఆటంకం కలిగించాడని బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యా దు మేరకు బుధవారం వెంకటయ్యపై కేసు నమోదు చేశామని తెలిపారు.

గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



రాష్ట్ర మహాసభలకు తరలివెళ్తున్న గిరిజన సంఘం నాయకులు

పాన్‌గల్: మిర్యాలగూడలో జరుగుతున్న గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహా సభలకు బుధవారం జిల్లా నుంచి గిరిజన ప్రతినిధులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలు, సబ్ ప్లాన్ చట్టం, గిరిజన బంధును అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యలను మహాసభల్లో చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తరలివెళ్లిన వారిలో జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు మత్రునాయక్, సోమ్లానాయక్, హరిశంకర్, బాబునాయక్, మహేష్, శ్రీను, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలకు న్యాయం చేసే వరకు పోరాటం



ఆత్మకూర్‌లో సీడీపీఓకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

ఆత్మకూర్: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీహరి, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కొత్తకోట, మదనాపూర్, అమరచింత, ఆత్మకూర్ మండలాల అంగన్‌వాడీ టీచర్లు నిరసన తెలిపి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓకు అందజేశారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, చట్టబద్ధ సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు శారద, నాయకులు భారతీయుడు, వనజ, రాణి, సంధ్య, నాగేంద్రమ్మ, కవిత, రేవతి తదితరులు ఉన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని బుధవారం సమ్మె చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి కనీస ఉద్యోగ భద్రత, సౌకర్యాలు, హెల్త్ కార్డులు, బోనస్ అందించడంతో పాటు వేతనాలు పెంచాలని తదితర డిమాండ్లను ప్రభుత్వానికి నివేదించారు. అలాగే ఈనెల 2, 3న వంటావార్పుతో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న 20 డిమాండ్లతో కూడిన సమ్మెకు అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రాము, అంగన్‌వాడీలు రాధ, లక్ష్మీదేవి, శాంతాబాయి, సుగుణబాయి, మంజుల, అలివేల, అనురాధ, తిరుపతమ్మ, భారతి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి నిర్మాణంలో నాణ్యత లోపించొద్దు



పనుల నాణ్యతపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: పట్టణంలోని తొమ్మిదో వార్డులో నిర్మిస్తున్న సీసీ రహదారి పనుల్లో నాణ్యత లోపిస్తుంది, నాణ్యతతో పనులు చేయాలని బీజేపీ నాయకులు నిర్మాణ పనులను బుధవారం అడ్డుకున్నారు. తొమ్మిదో వార్డుకు చెందిన బీజేపీ నాయకులు దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు రహదారి వేస్తున్న కాంట్రాక్టర్‌తో పనుల నాణ్యతపై ప్రశ్నించారు. రహదారిపై ఉన్న మట్టిని తవ్వి ఆపై నూతన రహదారి నిర్మించాలని సూచించారు. తమకు ఇస్తున్న ఎస్టిమేషన్ ప్రకారమే సీసీ రహదారి వేస్తున్నామని కాంట్రాక్టర్ సమాధానం ఇవ్వడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సీసీ రహదారి నిర్మాణాలు జరిగేటప్పుడు సంబంధిత అధికారులు ఉండాలన్న విషయాలను సైతం మున్సిపల్ అధికారులు విస్మరించారని ఆరోపించారు. రహదారి నిర్మాణంలో నాణ్యత లోపిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పట్టణంలో జరుగుతున్న సీసీ రహదారుల నిర్మాణాల్లో అధికారులు, పాలకులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై, నాణ్యత లేని పనులు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీద విష్ణు, మంగ అనిల్, మరిడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఒత్తిడికి గురికావొద్దు



అమరచింతలో మాట్లాడుతున్న ఎంఈఓ భాస్కర్‌సింగ్

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలను ఒత్తిడి లేకుండా రాసి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని మాందాపూర్ కాంప్లెక్స్ పరిధిలో మాందాపూర్, చింతకుంట ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీరామ్, సర్పంచ్ జయరాములుసాగర్, చింతకుంట జీహెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అమరచింత: పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలో మంచి గ్రేడ్‌లను సాధించాలంటే ఇష్టపడి చదవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని ఎంఈఓ భాస్కర్ సింగ్ అన్నారు. పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులు ప్రేరణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, బలరాముడు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ప్రశాంతంగా, ఇష్టంతోనే రాస్తేనే సత్ఫలితాలు సాధ్యమవుతాయని మండల విద్యాధికారి భాస్కర్ సింగ్, జీహెచ్‌ఎంలు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ, అనంతరాం అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీ సౌమ్యరాణి ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడమాడలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు జీహెచ్‌ఎం వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో అప్పారెడ్డిపల్లి పాఠశాల హెచ్‌ఎం సూర్యసంజీవ, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



మదనాపురం: నిరంతరం ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే వ్యక్తి కాటేపల్లి జనార్దన్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని, ఆయన విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తారని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు తలకంటి మహిపాల్‌రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ, కేజీబీవీ పాఠశాల, అజ్జకొల్లు జెడ్పీ పాఠశాల, దుప్పల్లి పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్ రమేష్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారంలో ఈదమ్మ బోనాల జాతర సందర్భంగా బుధవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం నాలుగు జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి స్థానంలో పెద్దమానూరు ఎద్దులు, రెండో స్థానంలో జమ్మిచేడు, మూడో స్థానంలో మియాపూర్, గుమ్మడానికి చెందిన ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com